క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా సాధన చేస్తున్న మహిళలు

మునగపాక: ప్రతి ఒక్కరూ **యోగా సాధన** చేయాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక రాహుల్ గాంధీ కల్యాణమండపంలో నిర్వహిస్తున్న యోగా తరగతులను శనివారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయాన్ని యోగా కోసం కేటాయించాలన్నారు. యోగాతో మానసిక ప్రశాంత లభించడంతో పాటు ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోవా లని తెలిపారు. వెలుగు ఏపీఎం బాలరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఈవో ఆర్డీ సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా మాస్టర్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. అచ్యుతాపురం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా అచ్యుతా స్కూల్ యోగా మాస్టర్ సత్యనారాయణ విద్యార్థులతో ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు.

నేడు సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయం

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో సత్తెమ్మతల్లి అమ్మవారి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏటా జూన్ నెల మొదటి ఆదివారం ఈ పండగను చెరువుకాలువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా పండగను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలి



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని వేంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు కోరారు. స్థానిక సంతబయల రామాలయంలో శనివారం భగవద్గీతపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులంతా సన్మార్గంలో నడిచేలా భగవద్గీత దోహదపడుతుందన్నారు.

కుక్కల సంచారంతో బెంబేలు



అగ్రహారంలో సంచరిస్తున్న కుక్కలు

కశింకోట: స్థానిక అగ్రహారం వీధిలో ఊర కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దారిన పోయే సమయంలో కుక్కలు దాడి చేసి, కరుస్తుండటం వల్ల అనారోగ్యపాలు కావలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గవరపేట, సంతబయల, మేదరవీధి తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు. వీటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేంకటేశ్వరస్వామికి అలంకరణ



కశింకోట: జ్యేష్ఠ మాసం మొదటి శనివారం పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో స్వామివారిని పూలు, తులసి మాలలతోపాటు వజ్ర కవచాలంకృతులతో అందంగా అలంకరించి, పూజలు చేశారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మాయదారి మలుపులు

- హెచ్చరిక బోర్డులు లేక నిత్యం యాక్సిడెంట్లు
- పట్టించుకోని అధికారులు



చూచుకొండకు వెళ్లే దారిలో మలుపు



వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో ప్రమాదకర మలుపు

మునగపాక: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి వేళ వేగంగా ప్రయాణించే వాహనాలు మలుపుల వద్ద యాక్సిడెంట్‌కు గురవుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినా అధికారులు వాటి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

వాడ్రాపల్లి మార్గంలో..

మండలంలోని వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో ఎక్కడ చూసినా మలుపులే దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈమార్గంలో మల్లవరం,కుంచవానిపాలెం,గొల్లలపాలెం, అప్పికొండవానిపాలెం,పాత నాగవరం, కొత్త నాగవరం మీదుగా పరవాడకు వెళుతుంటారు. మలుపుల కారణంగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చూచుకొండ దారిలో..

అచ్యుతాపురం మండలం కొండకర్ల నుంచి మునగపాక మండలం చూచుకొండ,గణపర్తి,మెలిపాక తదితర గ్రామాలకు వెళ్లే దారిలో పలు మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఈ మార్గంలో తొమ్మిదికి తక్కువ కాకుండా మలుపులు ఉన్నాయి. నిత్యం ఈ మార్గంలో అటు యలమంచిలికి ఇటు మునగపాక,అచ్యుతాపురం తదితర ప్రాంతాలకు ఆటోలు,ద్విచక్ర వాహనాలు,ఇతర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. మలుపుల వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు.

మూలపేట రోడ్డు

మునగపాక నుంచి మూలపేట మీదుగా అనకాపల్లికి నిత్యం పలు పనులపై ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.రహదారి పొడవునా పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అనకాపల్లి వెళ్లేందుకు తక్కువ సమయం పడుతున్నందున ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తుంటారు.



మునగపాక నుంచి మూలపేట మీదుగా అనకాపల్లికి వెళ్లే మలుపులో ఇరువైపులా తుప్పలు

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి



వాడ్రాపల్లి రోడ్డులో మలుపుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అడుగడుగునా మలుపులే కనిపిస్తుంటాయి. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి,మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– బొడ్డేడ చెల్లయ్యనాయుడు, మూలపేట

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



చూచుకొండ మార్గంలో అడుగడుగునా మలుపులే కనిపిస్తుంటాయి. మలుపులు ఎక్కువగా ఉన్నందున ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.

– కాండ్రేగుల కిరణ్‌కుమార్, చూచుకొండ

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం

మలుపుల వద్ద ప్రయాణం సాగించేవారు ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తుండాలి. మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేస్తాం.

– ఎం.ఉషారాణి, ఎంపీడీవో, మునగపాక మండలం

వైభవంగా పరదేశి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న భక్తులు

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని లాలం కోడూరులో పరదేశి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, ఆలయ ప్రారంభోత్సవాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం



పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రవిబాబు

అచ్యుతాపురం రూరల్ : పొగాకు ఆరోగ్యానికి హానికరమని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.రవిబాబు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం హరిపాలెం గ్రామస్తులకు పొగాకు వల్ల కలిగే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వినియోగిస్తే క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి ఎస్.శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు ఎ.రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో సాగు లాభదాయకం

పాయకరావుపేట : యాంత్రీకరణతో వ్యవసాయం చేయడంతో ద్వారా పని త్వరగా జరగడంతో పాటు సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని పలువురు శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని గోపాలపట్నం, నామవరం, సీతారాంపురం, పి.ఎల్.పురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ వరిలో యాంత్రీకరణ ద్వారా సుమారు రూ.ఏడు వేల వరకు సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కొబ్బరిలో విత్తన ఎంపిక, తోటల యాజమాన్యం, భూసార పరిరక్షణకు అంతర పంటల యాజమాన్యం గురించి వివరించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా నేలకు అన్ని రకాల పోషకాలను అందించడమే కాక, జీవజాలాన్ని పెంచడం ద్వారా సారవంతమైన ఉత్పాదకతను పెంచవచ్చని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువుల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ నూతన వరి రకాలు, ముంపును తట్టుకునే వరి రకాలు, వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకునేందుకు యాంత్రీకరణ ప్రాధాన్యత గురించి, డ్రోన్ వినియోగం గురించి వివరించారు. నమో డ్రోన్ దీదీ పథకం, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శివ, కృష్ణ, అభ్యుదయ రైతులు పెద్దిరాజు, నూకరాజు, రామకృష్ణ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సతీష్, శిరీషా, శ్రవణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రభాకర్

ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి



సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం విచారకరమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ సరకులు అందించేందుకు ఎండీయూ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి రేషన్ డిపోల ద్వారా సరుకులు తీసుకోవాలంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో 9,260 వాహనాలతో రేషన్ సరుకులు అందించడం ద్వారా ప్రజలకు మేలు జరిగిందన్నారు. సంబంధిత వాహనాలపై ఆధారపడి ఎంతోమంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రేషన్‌కార్డుదారులు సుదూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ తీసుకోవడం కష్టతరంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా క్యూలో గంటల కొలదీ నిలుచొని సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఎండీయూ వ్యవస్థను కొనసాగించేలా చూడాలని కోరారు.అంతేకాకుండా ఎండీయూ ఆపరేటర్లు,సహాయకులఆందోళనకు సీఐటీయూ మద్దతు తెలుపుతుందని చెప్పారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీటీ శేషుబాబు

మునగపాక: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని డీటీ శేషుబాబు తెలిపారు. పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా మండలంలోని అరబుపాలెం దళితవాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సోదర భావంతో మెలగాలని తెలిపారు. కులమతాలకు అతీతంగా అంతా సమానమన్న భావన ప్రజల్లో కలగాలని చెప్పారు. చిన్నచిన్న వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు, గంట్రెడ్డి సూరిబాబు,మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, గంగాధర్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం



ధ్వంసమైన గుర్రాజుపేట రోడ్డు



గతుకుల రోడ్డుపై వెళుతున్న లారీ

ఎస్.రాయవరం: భారీ వాహనాల రాకపోకలతో గుర్రాజుపేట మెయిన్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఎల్ కోస్టల్ పరిశ్రమ వ్యర్థ పదార్థాలను భారీవాహనాలతో తరలిస్తుండడంతో రహదారిపై గోతులు ఏర్పడ్డాయని వారు తెలిపారు. గ్రామంలో కొన్ని అభివృద్ధి పనులకు నగదు ఇస్తామన్న ఒప్పందంతో గ్రామ పెద్దలు గ్రామం మీదుగా భారీ లారీల రాకపోకలకు అంగీకరించారు. ఈ క్రమంలో పరిశ్రమ యాజమాన్యం రాత్రీపగలు అన్న తేడాలేకుండా రోజూ పదుల సంఖ్యలో భారీ వాహనాలతో వ్యర్థాలను తరలిస్తోందని, దీంతో రోడ్డు ధ్వంసమైందని గ్రామస్తులు తెలిపారు. కాలినడకన వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోయారు. రోడ్డు దెబ్బతిన్నా వాహనాలు రాకపోకలు ఆగడం లేదన్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభం



ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న ఆలయ ధర్మకర్తలు, భక్తులు

అచ్యుతాపురం రూరల్ : మండల కేంద్రం అచ్యుతాపురంలోని ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. తప్పెట గుళ్లు, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్తలు రామకృష్ణ, కంచరాన సూర్యనారాయణ, సరోజిని దంపతులు, వెంకటసత్య దుర్గా ప్రసాద్, మానస దంపతులు, వారి కుమారుడు రియాన్స్, సత్యనారాయణ, జ్యోతి దంపతులు, అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు, ఎంపీటీసీ ద్వారపురెడ్డి బాబ్జి, కూనిశెట్టి రమణ, కలిదిండి సత్యనారాయణ వర్మ, పల్లి శేషగిరిరావు, రిటైర్డ్ వీఆర్వో ధర్మిరెడ్డి బాబూరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు



చిననందిపల్లిలో నవధాన్యాల పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

దేవరాపల్లి: తొలకరికి ముందు నవ ధాన్యాలను సాగు చేయడం ద్వారా బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలోని చిననందిపల్లి, మారేపల్లి గ్రామాల్లో శనివారం క్షేత్రస్థాయి సందర్శన చేశారు. నవధాన్యాల సాగుతో నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. భూసారం పెరిగి, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు బాలు, కె.సత్యారావు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పాడి రైతులకు పశుదాణా



దాణాను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

కె.కోటపాడు : కాన్సన్‌ట్రేట్ ఫీడ్‌తో పశువులకు పోషకారం అందుతుందని చౌడువాడ పశువైద్యాధికారి సింహాచలంనాయుడు అన్నారు. పశుసంవర్ధకశాఖ ద్వారా కె.కోటపాడు మండలానికి వచ్చిన కాన్సన్‌ట్రేట్ ఫీడ్(పశుదాణా)ను శనివారం పాడిరైతులకు పంపిణీ చేశారు. మార్కెట్‌లో కాన్సన్‌ట్రేట్ ఫీడ్ 50 కిలోల బస్తా ధర రూ.1100 ఉండగా ప్రభుత్వం 50 శాతం రాయితీపై రూ. 550లకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పశుదాణాను ప్రతి రోజు రెండు సమయాల్లో పశువులకు అందించాలని, పాల దిగుబడి, పాలలో వెన్నశాతం పెరుగుతుందని పశువైద్యాధికారి తెలిపారు. మండల వ్యాప్తంగా 241 బస్తాలను రైతులకు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై. నాయుడు, సమీరా, పశువైద్య సహాయకులు త్రినాథ్, కె.గోపి, శివకుమార్, తేజ పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న పశుదాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఎ.కొత్తపల్లి రైతు భరోసా కేంద్రంలో పశు సంవర్ధకశాఖ ద్వారా యాభై రాయితీపై సరఫరా చేసిన పశు దాణా బస్తాలను సర్పంచ్ చింతల సత్యవెంకటరమణ సమక్షంలో పాడి రైతులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి మాట్లాడుతూ మండలంలోని మొదటి దశలో 220 బస్తాల దాణాను కేటాయించారన్నారు. కాశీపురంలో సర్పంచ్ వరలక్ష్మి చేతుల మీదుగా పశుదాణా బస్తాలు అందజేశారు.

మెరిట్ విద్యార్థులకు సత్కారం



టెన్త్ మండల టాపర్ గాయత్రిని సత్కరిస్తున్న సీఐ అప్పలరాజు, జవహర్ క్లబ్ ప్రతినిధులు

చోడవరం : విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తే మంచి ఫలితాలు వస్తాయని చోడవరం సీఐ అప్పలరాజు అన్నారు. స్థానిక జవహర్‌క్లబ్‌లో క్లబ్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పోతల ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చోడవరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని గాయత్రిని సత్కరించారు. పేదకుటుంబానికి చెందిన ఈ విద్యార్థి ఉన్నత చదువుల కోసం క్లబ్ తరపున రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, న్యాయవాది మంథా గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఖైనీ, గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు

గొలుగొండ : నిషేధిత ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటి మత్తు పదార్థాలు కిరాణా షాపులు, ఇతర ప్రాంతాల్లో అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని గొలుగొండ ఎస్ఐ రామారావు హెచ్చరించారు. ఆయన సిబ్బందితో గొలుగొండ, జోగుంపేట, చీడిగుమ్మల, ఎర్రవరం, కొత్త మల్లంపేట తదితర ప్రాంతాల్లో కిరాణా షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా ప్రతి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో గొలుగొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షటిల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నాతవరం : మండల కేంద్రంలో ఈ నెల 3న శ్రీకోటమ్మ తల్లి పండగ సందర్భంగా షటిల్ పోటీలు ఏర్పాటు చేశామని నాతవరం ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కరక అప్పలరాజు తెలిపారు. దివంగత నేత వైఎస్సార్‌సీపీ నాయకుడు అంకంరెడ్డి జమీలు సైన్యం ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మాజీ ఎంపీపీ కొండబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాణిక్యం, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ, మాజీ సభ్యుడు సీతారామమూర్తి, నూకాలమ్మతల్లి ఆలయ మాజీ చైర్మన్ శ్రీరామమూర్తి, నాతవరం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లచ్చబాబు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణుల తీర్థం

మాడుగుల రూరల్ : కె.జె.పురం దబ్బకుంటు రహదారిలో శ్రీ రాధాకృష్ణుల తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి భారీ స్థాయిలో అన్నసమారాధన జరిపారు. సాంస్కృతిక కార్యక్రమం ప్రదర్శించారు.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 15/2019 in O.S.No. 194/2013

D.Hr. : వేమిశెట్టి క్రిష్ణ
And
J.Dr. : పురాలశెట్టి దేవి

వేలం ప్రకటన

ఇందలి D.Hr కు J.Dr నుండి రావలసిన పై నెంబరు అమలు బాకీ దర్మిలా వడ్డీ వగైరాలు వసూలు నిమిత్తం యిందలి J.Dr కు సంపూర్ణ హక్కు అనుభవం స్వాధీనం గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **తే॥ 17-06-2025దిన** పై కోర్టు వారు బహిరంగ వేలం వేయుటకు నిర్ణయించినారు. కావున సదరు బహిరంగ వేలంలోపాడుకోదలచిన వారు పై కోర్టులో **తే॥ 17-06-2025ది ఉదయం గం॥ 10-30 ని॥ లగాయితు సాయంత్రం 5-00 గం॥లలోపు** హాజరై వేలంలో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పాడుకోగలరు.

షెడ్యూలు ఆస్తి వివరం

అనకాపల్లి జిల్లా (లోగడ విశాఖపట్నం జిల్లా), నక్కపల్లి సబ్ రిజిస్ట్రీ, నక్కపల్లి మండలం – నెల్లిపూడి పంచాయతీ మరియు గ్రామ పరిధి సర్వే నెం. 250/2 మరియు 250/4లలో గల జి.పల్లం భూమి మొత్తం విస్తీర్ణం ఎ. 2-34 సెంట్లు (సర్వే నెం. 250/2లో ఎ. 1-90 సెంట్లు మరియు సర్వే నెం. 250/4లో ఎ. 0-44 సెంట్లు) ఏక ప్రతిగా గల పల్లం భూమికి **హద్దులు: తూర్పు:** కొవిరి సత్తిరాజు భూమి, **పడమర:** చెరువు గట్టు, **దక్షిణం:** అన్నవరం వారి భూమి, **ఉత్తరం:** అన్నవరం వారి భూమి

D.Hr. విలువ : Rs. 4,00,000/-,
అమీన్ విలువ : Rs. 14,04,000/-
మార్కెట్ విలువ : Rs. 35,10,000/-

(By Order of the Court)

PSRC పట్నాయక్,
D.Hr. తరపు అడ్వకేట్, యలమంచిలి
సెల్: 9491997309

యలమంచిలి
తే॥ 31-05-2025

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. 46/2021 EP 9/2024

Between:
రాయి తిరుపతిరావు ... DHR/ వాది
మరియు
కుర్రు వెంకట రమణరావు ... JDR/ ప్రతివాది

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో JDR / ప్రతివాది వలన ఈ నెంబరు DHR / వాదికి రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తము ఈ దిగువ షెడ్యూల్ దాఖలా JDR / ప్రతివాది తాలూకు స్థిరాస్తిని వేలం వేయు నిమిత్తము తేది. 17-6-2025న వాయిదా అయి వున్నది. కావున వేలంలో పాల్గొనే వారు తేది. 17-6-2025న ఉదయము 10-30 గంటలకు పై కోర్టు వారు ఎదుట హాజరై వేలములో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, ప్రస్తుతము అనకాపల్లి జిల్లా, నక్కపల్లి సబ్-రిజి., నక్కపల్లి మండలం, చినదొడ్డుగొల్లు గ్రామ పంచాయతీ, చినదొడ్డుగొల్లు గ్రామం జిరాయితీ, మెట్టు భూమి సర్వే నెంబర్ 453/5 ఎ.1-20 సెంట్లులో ఎ 1-00 సెంట్లుకు హద్దులు
తూర్పు: అడపా వెంకటరమణ గారి భూమి
దక్షిణం: వెలగా మురళి మోహన్ వగైరాలు భూమి
పడమర: బంగారి అప్పన్న గారి భూమి
ఉత్తరం: గొర్జ

DHR Value : Rs. 30,00,000/-
Amin Value : Rs. 50,00,000/-
Market Value: Rs. 15,00,000/-

//కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం//

రాజాన గోవిందరావు
అడ్వకేటు, యలమంచిలి,
సెల్: 9848460118

యలమంచిలి,
తేది. 31-05-2025